## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 9-6-03, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవాన్, బాబాగారు వీరందరూ కూడా భగవంతుడి ప్రతినిధులే, వారు మన జీవితాలను సారవంతం చేసారు, అనేకమంది జీవితాలకు వెలుగుచూపించారు. అజ్ఞానంలోనుండి బయటకురావాలి అనే తపన వారి అనుగ్రహంలేకుండా మనకు కలుగదు. ఒక దేవతయొక్క అనుగ్రహం లేకుండా మనం అజ్ఞానంలో నుండి బయటకురాలేము. మనం జీవితంలో అభివృద్ధిలోనికి రావాలంటే ఆరోజుకారోజు ఆలోచన పెంచుకొంటూరావాలి, అహంభావన తగ్గించుకొంటూరావాలి, ఇదిసాధనఅంటే. మీకు అందరికి ఆత్మజ్ఞానంకలగాలి, మీరు అందరూ జీవన్ముక్తులు అవ్వాలి, ఎవరో బాబాగారు, భగవాన్ జ్ఞానులు అయితే సరిపోదు, మీరుకూడా అంతటి వారు అవ్వాలని, ఆత్మానందం మీరుకూడా పొందాలని ఈసభలు, సమావేశాలు అంతేగాని ఇవి పబ్లిసిటీకోసంకాదు. మనమనస్సె ఇంద్రియాలద్వారా బయటకు వెళ్ళి విషయ ఆకర్షణకుఎక్కువలోబడుతూ ఉంటుంది. మనకు విషయాలపట్ల ఉన్న ఆకర్షణ ఈశ్వరుడి మీద ఉండదు. మన మనస్సు విషయచింతనవైపుకు ఎంత వేగంగా వెళుతుందో అంతవేగంగా ఆత్మవైపుకు వెళ్ళదు. మనకు రూపంఅన్నా, నామంఅన్నా బాగా ఇష్టం. భగవంతుడి యొక్క రూపాన్ని అలంకరిస్తే మనరూపం ఆరూపం మీద నిలబడి ఉంటుంది, బాగా అలంకరిస్తే చూసేకొలది చూడాలని పిస్తుంది, అప్పడు మనకు దేవతాచింతన పెరుగుతుంది, ఆదేవతమీద ఇష్టం పెరుగుతుంది, విషయచింతన తగ్గుతుంది. అందుకే మన పెద్దలు దేవతలను అలంకరిస్తారు. దేవుడు అంతటా ఉన్నాడు కదా మరి గుడికి వెళ్ళటం ఎందుకు అంటారు. ఆవులో పాలు ఉంటాయి కాని అవి ఎక్కడ పితికితే అక్కడ నుండి పాలురావు, పొదుగు దగ్గర ఉన్న సన్నకట్లు పట్టుకొని పిండితే పాలు వస్తాయి అలాగే భగవంతుడు అంతటా ఉన్నాడు కాని ఆయనకు ఒక గుడి కట్టించి ఆయనకు ఒకరూపం కల్పించి, ఒక నామంపెట్టి ఆయనను పూజించటం వలన ఆవు పొదుగులో నుండి పాలు ఎలా వస్తాయో అలాగే ఆరూపం ద్వారా మనకు ఆయన కృప కలుగుతుంది అందుకే మనం గుడికి వెళతాము. గుడిలో శివుడిని చూస్తూ ఉంటే శవభావం తగ్గి, శివభావం పెరుగుతూ ఉంటుంది.

ఈ శరీరమే ఆత్మ, ఈశరీరమే సర్వస్వం, ఈశరీరమే జ్ఞానం అని మనం అనుకొంటున్నాము. ఆత్మకు శరీరం లేదు, ఈశరీరం అహంభావనది. ఈ శరీరం ఆత్మకానప్పడు, ఇదే ఆత్మ అని ఎందుకు అనుకొంటున్నాము అంటే దీనికి అజ్ఞానంకారణం, అందులో నుండి మనలను విడుదలచేసేవాడే గురువు. ఆత్మ ఒక్కటే సత్యం, అదేశాంతి, అదే జ్ఞానం, దానికి పుట్టుకలేదు, మరణం లేదు, అది మనమై ఉన్నాము. కాని దాని అనుభవం మనకు లేకపోవటం వలన అది, ఇది అనుకొంటున్నాము, మరణానికి గురి అవుతున్నాము. ఇతరులచేత మనం గౌరవింపబడాలి అనే కోరిక మనకు ఉండకూడదు. గౌరవింపబడాలి అనే కోరిక ఉంటే మనం భక్తులం అవ్వలేము, మనమనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. మానవ కల్పితంకానిది, ప్రకృతి కల్పితంకానిది బ్రహ్మం ఒక్కటే, ఆబ్రహ్మామునే భక్తుడు భగవంతుడు అని పిలుస్తున్నాడు. మన శరీరం అందంగా, ఆరోగ్యంగాఉంది అనుకోండి కాని మనస్సు అందంగా, ఆరోగ్యంగా లేదు అనుకోండి మనకు సమగ్రతరాదు, నిండుతనంరాదు. మీరు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నారు అనుకోండి, మనస్సు శాంతిగా ఉంది అనుకోండి మీమొఖాలు చూస్తే శాంతిగా, కాంతిగా ఉంటాయి. ప్రపంచంలో అన్నింటికంటే గొప్పది శాంతి. శాంతి లేకుండా సుఖంలేదు, ఆనందంలేదు. వేలాదికోట్లు డబ్బు ఉన్నవారుకూడా శాంతిలేక కాలిపోతూ ఉంటారు. శాంతి ఉన్నవాడికి ఆనందం, సుఖం, శాంతిలేనివాడు కాలిపోవడం. శాంతిలో మనం స్థిరపడినప్పడు పునర్జన్మ లేని స్థితికి ఎదిగి, ఆత్మానుభవం పొందుతాము. జీవితంలో కష్టం వస్తుంది, సుఖంవస్తుంది, వేడివస్తుంది, చలివస్తుంది వీటిని సహించటం నేర్చుకో. నీ దేహప్రారబ్దమును బట్టి ఒకోసారి చిక్కులు రావచ్చును, కష్టాలు రావచ్చును ఏసమస్య వచ్చినా పారిపోకు, ఏడపు మొఖంతో కాకుండా నవ్వుతూ శాంతిగా వాటిని పరిష్కారం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎవరైతే కాలాన్ని సద్వినియోగం చేసుకొంటున్నారో వారు కాలానికి యజమానులు అవుతారు, ఎవరైతే కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం లేదో వారు కాలానికి బానిసలవుతారు. జ్ఞానికాలాన్ని జయిస్తాడు, వాడు కాలానికి యజమాని, అది జ్ఞానం యొక్క వైభవం. షిరిడీబాబా గారిలో కులబేధం లేదు, మతబేధం లేదు, హిందూ ముస్లిములసమైక్యత కోసం హృదయపూర్వకంగా పనిచేసారు. ప్రతీ మతంలోనూ మంచి, చెడూ ఉండవచ్చు. మనమతం గొప్పది, ఇతర మతాలు గొప్పవి కావు అని అనుకోకూడదు, దాని వలన టైమువేస్టు, ఎనర్జీవేస్టు ఎప్పడూ ఇతరుల లోపాలు చూడటం కాదు, మనలో ఉన్నలోపాలు మనం చూసుకోవాలి, అది సత్వగుణం ఉన్నవాడి లక్షణం, బాగుపడే వాడి లక్షణం. ఎక్కడైనా మంచి ఉంటే , సభ్యత

ఉంటే, నాగరికత ఉంటే అది మనం అంగీకరించాలి, అదిమనం నేర్చుకోవాలి.  నామనస్సులో అనేకకోరికలు రావచ్చు, మంచి కోరికలు రావచ్చు, చెడు కోరికలు రావచ్చు, ఇదంతా వాసనను బట్టి వస్తుంది.  ఆకోరికలకు, ఈమనస్సుకు, ఈశరీరానికి, మన చేతచూడబడే ఈలోకానికి వీటి అన్నింటికి అతీతంగా ఒక వస్తువు ఉంది, అదే బ్రహ్మం.  అది ఉండటమేకాదు, అది మనమై ఉన్నాము దాని తాలుక అనుభవం మనకు వచ్చేవరకు ఈజననమరణాలు ఈప్రకృతి మనలను విడిచిపెట్టదు.  మనం హిందూమతంలో పుట్టాము, ఇందులో కూడా మోక్షానికి తగిన సామాగ్రి ఉంది, అందువలన మన మతాన్ని అర్థంచేసుకొని, అందులోని విషయాలను ఆచరించి మనం బాగుపడాలి కాని పరమత దూషణవద్దు.  పుట్టిన వాడు మరణిస్తాడు, మరణించినవాడు తిరిగి పుడతాడు, దీని గురించి బెంగ ఎందుకు, ఇది సహజం, మీరు భక్తిని విడిచిపెట్టవద్దు, భక్తి వలన శాంతి వస్తుంది, ముక్తి కలుగుతుంది. ఆత్మ అన్నా, గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే.  ఆత్మను విడిచిపెట్టి గురువులేడు. కోటి గ్రంధాలు చదవటం కంటే కోటి ప్రాణాయామాలు చేయటం కంటే మనం బాగుపడటానికి గురువు యొక్క అనుగ్రహం లిప్తమాత్రం సరిపోతుంది.  భగవంతుడు ఉన్నాడని మనం నమ్ముతున్నాము కాని నూటికి నూరుపాళ్ళు నమ్మటం లేదు.  భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నూటికి నూరుపాళ్ళు మనకు నమ్మకం ఉంటే ఆయన సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తోంది  అనే స్థిరభావం మనకు ఉంటే మన మనస్సు పల్చబడి, చిరిగిపోతుంది.  ఈప్లాట్‌ఫారం క్రింద బంగారం ఉంది అనుకోండి ఇక్కడ బంగారం ఉంది అని నాకు తెలియదు అనుకోండి, అక్కడే ఎన్ని సంవత్సరాలు తిరిగినా బంగారం కోసం అక్కడ వెతకాలి అని నాకు తెలియదు.  ఎవరో గురువు వచ్చి నువ్వు ఎక్కడైతే కూర్చొన్నావో అక్కడే బంగారం ఉంది బంగారం కోసం మార్కెట్‌లో తిరుగుతున్నావు అని చెపితే అయితే ఇక్కడే ఉందా, ఇక్కడ త్రవ్వి చూద్దాము అనుకొంటావు.  అలాగే సత్యవస్తువు ఎక్కడ ఉందోనీకు చూపించి, అక్కడకు నిన్ను తీసుకొని వెళ్ళేవాడే గురువు, వాడే దేవుడు, వాడే నిజమైన మిత్రుడు.  మనకు స్వప్నంవచ్చినప్పుడు స్వప్నాన్ని చూస్తాము, అది నిజం అనుకొంటాము.  మరల జాగ్రదవస్థలోనికి రాగానే అది స్వప్నం, నిజం కాదు అని మనకు తెలుస్తుంది.  ఇప్పుడు మనకు కనిపిస్తున్న ఈ ప్రపంచాన్ని స్వప్నంలాగ చూడటం నేర్చుకోవాలి, అప్పుడు మనస్సులోపలకు వెళుతుంది.  మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు గర్వం తెచ్చుకోవద్దు, ప్రతికూలంగా ఉన్నప్పుడు కృంగిపోవద్దు.  ఇవన్నీ నిజంకాదు,

**20-09-2003**



ఈసంఘటలన్నీ దేహప్రారబ్దమును బట్టి ఎదురవుతాయి, ఇది జ్ఞాపకం పెట్టుకోండి.

మనకు మనస్సే నేనుగా వ్యక్త మవుతోంది.  పెంటఅంతా మనస్సులోనే ఉంది.  అది ఎవరని దానిని మనం విచారణ చేయాలి. అది నశించిన వెంటనే స్వరూపంతానుగా వ్యక్తమవుతుంది. ఆసక్తిపెట్టుకోవద్దు, ఆసక్తిపెట్టుకొనే కొలది మిధ్యానేను పెరుగుతుంది.  నువ్వు చేసేపని శ్రద్దగా చేసుకో.  భగవంతుని పాదాలను విడిచిపెట్టవద్దు, చేతనైతే సమాజానికి ఉపకరించు. కీర్తి తాలుక ధ్యాస, కీర్తి తాలుక తలంపు ఎవడికైతే లేదో వాడు భక్తుడు. మనం బాగుపడాలంటే నిరంతరం కృషి చేయాలి, సాధన చేయాలి.  ఆత్మజ్ఞానం పొందాలి అనుకొన్నప్పుడు విశ్రాంతి లేని కృషి అవసరం. నిష్కామకర్మచేయండి, మీకు ఏదైనా మంచి విషయం తెలిస్తే అది ఇతరులకు బోధించండి,ఇతరులు ఎవరైనా దుఃఖంతో కాలిపోతూ ఉంటే చల్లని మాటలు చెప్పండి, చల్లని చూపులు ప్రసాదించండి.  ఈసృష్టిలో అన్నింటికంటే అందమైనది బ్రహ్మం. బ్రహ్మం ఎంత అందంగా ఉందో, ఎంత సౌందర్యంగా ఉందో మన మనస్సును కూడా అంత సౌందర్యవంతంగా చేసుకుంటే గాని ఇది అందులో లీనం కాదు. మూడు నెలలు, ఆరునెలలు పసి పిల్లలను చూడండి, ఎంత హాయిగా నిద్రపోతూ ఉంటారో, వారి అమాయకత్వమే వారికి అందం.  తల్లి వాళ్లను ముస్తాబుచేస్తుంది.  వారికి కపటం తెలియదు, ఈర్ష్య, అసూయ తెలియదు. అటువంటి స్థితి మనకు వస్తేకదా మనకు జ్ఞానం కలిగేది.  ఇంట్లో పేచీలు, సమాజంలో పేచీలు, మనిషికి మనిషికి బేధాలు ఇవన్నీ మనస్సు నుండిపుడుతున్నాయి.  ఇవిఅన్నీ మనస్సుకు సంబంధించిన వృత్తులు, ఆ మనస్సు అనే గడప దాటితేనే గాని హృదయంలో ఉన్న సౌందర్యం మనకు అందదు.  ఎవరో వచ్చి మిమ్మల్ని యాతన పెట్టనక్కరలేదు, మీ మనస్సే చాలు, అందుకే దానిని యాతనాశరీరం అంటారు. ఈయాతనాశరీరం నుండి విడుదల పొందితేకదా హృదయంలో ఉన్న సౌందర్యం మనకు తెలిసేది.  మనస్సు సౌందర్యంగా ఉంటే, ఏకాగ్రంగా ఉంటే, శుచిగా ఉంటే లోపలఉన్న జ్ఞానగంగ మన చేతికి అందుతుంది.  మీరు ఏపనిచేసినా, ఏది మాట్లాడినా భగవంతుని దయకోసమే చేయండి.  మీ గొప్పతనం వ్యక్తంచేయటం కోసం ఒక్కమాట మాట్లాడినా లోపల అజ్ఞానం పెరిగిపోతుంది అవిద్యలో కూరుకుపోతాము.  గురువు ఋణం ఎప్పుడు తీరుతుంది?  గురువు చెప్పినది బాగా అర్థం చేసుకొని, ఆచరించి, అనుభవిస్తే అప్పుడు గురువు ఋణం తీరుతుంది.

**రమణ భాస్కర**

# సత్సంగ ప్రాముఖ్యత

(కె. వీరలక్ష్మి, విజయనగరం)

భగవాన్ శ్రీరమణులు సత్సంగమంటే "సత్" తో సంగమం, "సత్" కేవలం ఆత్మకు చెందినది. ఆత్మ "సత్" అని ప్రత్యక్షానుభవం లేదుకనుక దానిని తెలిసిన యోగుల సంసర్గము సత్సంగమని తెలిపిరి. అంతర్ముఖత్వం దాని ఫలమనియు, మనస్సు దుర్బలంకనుక సత్సంగము, ఈశ్వరారాధనము, సద్గ్రంథపఠనము అన్నియు ఎంతోమహిమాన్విత ములైయున్నవి. ఇవి సాధకునకు ఆధ్యాత్మిక పురోగతిని కలుగజేయునని చెప్పిరి.

క్షేత్రదర్శనము, విగ్రహారాధన కన్న సత్పురుషుల సాన్నిత్యము విశేష ఫలప్రదమని శ్రీరమణులు తెల్పిరి. ఏమనగా కాలాంతరమున అవి ఫలితాన్ని ఇస్తాయి. సత్పురుషుల దర్శనము తక్షణమే ఫలవంతమగునని చెప్పియున్నారు.

ఉదా శ్లో : గంగాపాపం శశీతాపం
దైన్యం కల్పతరుస్థథా
పాపం తాపం దైన్యంచ
హన్తి సజ్జనదర్శనం

ఇవి ఒక్కొక్క గుణాన్ని ఒక్కొక్క క్షేత్రం కాని, ఆయాదేవతలు కాని నశింపజేస్తే ఆమూడు గుణాలు సజ్జన దర్శనము వలన క్షాళితమవుతాయని శ్రీరమణులు తెల్పిరి.

శ్రీ సద్గురు నాన్నగారి పిన్నవయసులో ఒకనాటి రాత్రి స్వప్నమున శ్రీరమణుల అనుగ్రహ స్పర్శను పొంది ఏసాధనము, తపమును, లేకుండగనే అద్వైతానుభూతిని పొందిరి. తదాది వీరు శ్రీ రమణుల దివ్యబోధనలను వాడవాడలా, దేశదేశములా అలుపు, విరామము ఎరుగని దీక్షతో ప్రచారము చేయుచున్నారు. జన సామాన్యమునకు ఆధ్యాత్మిక మార్గ ప్రగతిని అందజేయుచున్నారు. సద్గురు నాన్నగారి అనుగ్రహభాషణలు ఎందరెందరికో లౌకికముగా మనోధైర్యాన్ని, మనశ్శాంతిని కలుగజేయుచున్నాయి. సత్పురుషుల ఒక వీక్షణం, అనుగ్రహభాషణము, దివ్య ప్రేమాన్వితమైన స్పర్శ, ఎంతటి మహిమాన్వితమైనవో శ్రీనాన్నగారిని





ఎరిగియున్న భక్తులకెల్లరకు అనుభవైకవేద్యమై యున్నది.

సత్పురుషుని ఉనికి వల్లనే లోకంలో శాంతి నెలకొని యున్నది. మనం భుజించే ఆహారం, త్రాగేనీరు, పీల్చేగాలి, మనస్సు, ఆలోచన, అన్నియు సత్పురుషుల సంగం ద్వారా పునీతములవుతున్నాయి. సత్పురుషుని స్పర్శను పొందిన ఆహారం ప్రసాదమని భారతీయుల విశ్వాసం. వారి దయా వీక్షణం వలన సకల జీవకోటి శాంతిగా, సుఖంగా జీవిస్తాయి.

శ్రీరమణుల కాలంలో ఆయన దర్శనం కోసం మానవమాత్రులేకాక పశుపక్ష్యాది జీవులు కూడా వస్తూండేవి. వారి సాన్నిధ్యం ఆ మూగజీవరాశులకు కూడా ఎంతటి సంతోషం కలుగజేయుచుండెడిదో. శ్రీరమణులు భూమి మీద సంచరించిన ప్రాంతం నేడు పవిత్ర క్షేత్రమై విరాజిల్లు చున్నది. కనుక సత్పురుషులు భూమిమీద సంచరిస్తున్న కాలంలో వారిని జనులు గుర్తించి సేవించిన ఎడల వేరు విధములైన ఏ నియమ నిష్టల ఆవశ్యకత లేకుండగనే సాధకులు పురోగతిని పొందుతారనెడిది నిత్య సత్యమై యున్నది.

భారతీయ తత్త్వశాస్త్రంలో సత్పురుషులకు విశిష్టమైన స్థానమీయబడినది. అందుకనే "దుర్లభంత్రయమేతతే" అని పెద్దలన్నారు. 1. మానవజన్మ, 2. మోక్షేచ్ఛ, 3. మహాపురుషుల సాంగత్యం అని తెలిపిరి. సత్పురుషుల సాంగత్యమును భక్తులు పొందినయెడల వారికి ఏనియమముల ఆవశ్యకత లేకయే ఆధ్మాత్మిక ప్రగతిని పొందుతారు అనే విషయంలో సందేహంలేదు. శ్రీ శంకరాచార్యుల వాక్కు కూడా ఈ విధంగా కలదు.

శ్లో : సత్సంగత్వేనిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చల తత్వం
నిశ్చల తత్వే జీవన్ముక్తిః

శ్రీ శంకరులు చెప్పిన విధంగా జీవన్ముక్తికి సత్సంగం సోపానమై యున్నది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 24-6-03 | మంగళవారం | రాజోలు, దొరగారి తోట, రంగరాజు గారి ఇల్లు |
| 30-6-03 | సోమవారం | దర్భరేవు |
| 13-7-03 | ఆదివారం | జిన్నూరు, శ్రీరమణక్షేత్రం, గురుపూర్ణిమ మహోత్సవము |

## చిత్తశుద్ధి

దుఃఖమునకు కారణం కర్తృత్త్వబుద్ధి. కర్తృత్త్వబుద్ధి నశించకుండా దుఃఖం నశించదు. కర్తృత్వబుద్ధి కారణమయితే దుఃఖం కార్యము. కర్తృత్త్వబుద్ధి ప్రకృతిగుణము, ఈశ్వరుడు కల్పించింది కాదు. ప్రకృతిని చింతిస్తూ ప్రకృతిగుణమును దాటలేము. నిరంతరము ఈశ్వరుడిని స్మరించటం వలన ప్రకృతిగుణములు నశిస్తాయి. ప్రకృతికి ఉన్నవికారములలో మొదటి వికారము కర్తృత్త్వబుద్ధి. దేహము పట్ల ఉన్న అహంబుద్ధి నుండి అది ఉదయిస్తుంది. కర్తృత్త్వము స్థూలరూపములో ఉన్నా, సూక్ష్మరూపములో ఉన్నా మానవుడిని పీడిస్తూ ఉంటుంది. ఈశ్వరదర్శనం అయిన వెంటనే అది అదృశ్యమవుతుంది.

చిత్తశుద్ధి లేకుండా కర్తృత్త్వబుద్ధి నశించదు. ఈశ్వరుని ధ్యానించకుండా చిత్తశుద్ధి కలుగదు. ఈశ్వరునికృప లభ్యమయ్యేవరకు ఉపాసన విడిచిపెట్టకూడదు. సాధకుడు సర్వవిధముల ప్రయత్నముచేసి చిత్తశుద్ధిని సంపాదించవలెను. పూజసాధన, జపసాధన, ధ్యానసాధన చిత్తశుద్ధిని సంపాదించుటకు సహకరిస్తాయి. ఈశ్వరార్పణబుద్ధితో కర్మను ఆచరించే వాడికి చిత్తశుద్ధి కల్గుతుంది, కాలక్రమంలో జ్ఞానోదయం అవుతుంది. చిత్తశుద్ధి కల్గినవాడికి మాత్రమే అంతర్దృష్టికలుగుతుంది, అంతర్దృష్టి కలిగినవాడికి అమృతానుభవం కల్గుతుంది. ధర్మం పిందె అయితే అమృతం పండు. అమృతానుభవం పొందినవాడికి మాత్రమే ఉన్నది ఉన్నట్లుగా లేనిది లేనట్లుగా గోచరమవుతుంది.

ప్రపంచమంతా తలంపుల సమూహము. తలంపులు త్యజించిన వాడికి సుఖం స్వరూపంగా వ్యక్తం అవుతుంది. ద్వైతమును కల్పించేవి తలంపులు. సమబుద్ధిని అలవర్చుకొని ద్వైతబుద్ధినుండి, భేదబుద్ధినుండి బయటపడాలి. చిత్తశుద్ధిలేకుండా బేధబుద్ధి నశించదు. బేధబుద్ధి నశించిన వాడు శ్రమలేకుండా అజ్ఞానబంధము నుండి విడుదలపొందుతాడు, కర్మను ప్రీతితోచేసేవాడికి, కర్మఫలమును కోరనివాడికి, తోటిమానవుడిని ద్వేషించని వానికి చిత్తశుద్ధి కల్గుతుంది. సమచిత్తత లభిస్తుంది, శ్రమలేకుండా దేహాభిమానము నుండి విడుదలపొందుతాడు. పేరుకోసం కర్మను ఆచరించేవాడు అశుద్ధచిత్తం నుండి విడుదలపొందలేడు. చిత్తశుద్ధిలేనివాడు మృత్యువును అతిక్రమించలేడు, ఆత్మవిద్యను సంపాదించలేడు, మోక్షమును పొందలేడు.

సద్గురు శ్రీ నాన్నగారు, జిన్నూరు

## శాశ్వతమైన జీవితము

మన స్వరూపాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడమే నిజమైనజీవితం. ప్రస్తుత మన జీవితంలో పూర్ణత్వం లేదు, ఏదో వెలితి, అశాంతి, దుఃఖం వెంటాడుతున్న కారణంగా, మనము శాశ్వతమైన జీవితాన్ని కోరుకుంటున్నాము. వాస్తవంగా మన స్వరూపంలో వెలితి, అశాంతి, దుఃఖం లేవు కాబట్టి వాటినుండి విడుదల పొందాలని కోరుకుంటున్నాము. నిర్మల 'ఆత్మ', పరమశాంతి యే మన సహజస్వరూపమైనప్పటికి కేవలము 'దేహము-నేను' అను బుద్ధి వల్ల దుఃఖాన్ని మోస్తున్నాము. శరీరము కేవలం ఒక తలంపు మాత్రమే. మూల-తలంపు రూపంలో సాక్షాత్తు 'ఆత్మ' నుండి ఉదయించే 'మనస్సు' యొక్క ఛాయారూప ఆకృతియే ఈ శరీరము.

కేవలం శరీరం మారడం వల్ల, అనగా శరీరం మరణించడం వల్ల సమస్య పరిష్కారము కాదు. శరీరం మారడం వల్ల 'అహంకారం' ఒక దేహము నుండి వేరొక దేహము లోనికి బదిలీ అవుతుంది. శాశ్వతమైన, కాలాతీతమైన కేవల ఉనికిగా, మహాచైతన్యముగా, అనంతముగా ఉండటమే నిజమైనజీవితం. హద్దులు, పరిమితులు లేని నిజమైన మన ఉనికిని కేవలము దేహమునకే పరిమితము చేస్తే, అనగా మనము దేహమాత్రుడిగా భావిస్తే, హద్దులకు, పరిమితులకు లోబడి అశాంతిని, దుఃఖాన్ని, పొందుచున్నాము. దేహబుద్ధి అనగా కేవలము 'దేహము-నేను' అను బుద్ధి నశిస్తే మన సహజస్థితి యైన సచ్చిదానంద అనంతత్త్వము అనుభవంలోనికి వస్తుంది, అప్పడు మనది నిజమైన శాశ్వతమైన జీవితం అవుతుంది.

చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్
అమలాపురం